స్కెచ్

# అల్పసంతోషులు

లంక నారాయణమూర్తి

ఆఫీసు సెలవు కదా అని ఆదివారంనాడు మధ్యాహ్నం కాస్త నడుము వాల్చేను. ఇంతలో శ్రీమతిగారు వంటింటిపని అయిందని పించి తమలపాకులు వేసుకుని చీరెమార్చుకుంది. "ఓహో ఎక్కడికో పెత్తనం చేస్తున్నారు కాబోలు" అనుకుంటూండగానే "ఏమండీ నేను కమలగారింటికి వెళ్ళొస్తాను. బాబ్జీగాడు లేస్తే కొంచెము ఎత్తుకుని ఆడించం"డని ఆజ్ఞ జారీచేసి మరీ వెళ్ళింది. హే భగవాన్! ఈ సెలవునాడైనా పగటిపూట కొంచెము హాయిగా కాలంగడుపుదా మనుకొంటే, ఈ కమలొకర్తె నా ప్రాణానికి! కమలతండ్రి డి.యస్.పి. గా చేసి రిటైరయ్యాడు. మేముండే ఇంటికి ఎదురుగానే ఆయనగారి బస. కమలకి సుమారు 21 సంవత్సరాలుంటాయి. మా జానక్కి కూడా అదే వయస్సు. ఆమెకింకా వివాహంకాలేదు. మెడిసన్ చదువుతోంది. అప్పుడప్పుడు సాయంకాలంవేళ సిటీబస్సులో కమల తటస్థపడడం, నేనులేచి సీటు ఇవ్వడంకూడాకద్దు. ఏక్షణంనుండి మా ఆవిడ ఈమెగారిస్నేహం పట్టిందో కాని, మహాప్రభో! ఒక్క ఆదివారంనాడు కూడ పన్నెండునుంచి సాయంకాలం నాలుగ్గంటలవరకు ఫిక్షరుండేది కాదు. పైగా స్త్రీస్వేచ్ఛ, మహిళాసంఘాలుఅంటూ మొదలుపెట్టిందీమధ్య.

నేనిలా ఏవో ఆలోచిస్తూండగానే బాబ్జీగాడు లేచి ఒక్కపెట్టున ఆనందభైరవిలో ఆరునొక్కటి ఆలాపనందుకున్నాడు. నాకేంతోచలేదు. లేచి వుయ్యాల్లోంచి తీసి వొళ్లో కూర్చోబెట్టి ఆడిస్తున్నాను. ఇంతట్లోకి కుర్రకుంక పంచతడిపేశాడు. ఏమిటీ ఖండాలం అనుకుంటూ వాడ్ని నేలనిక పడుకోబెడుతున్నాను. ఇంతలోనే వీధిలోంచి "గోపాల్రావుగారూ" అని యెవరో కేకవేశారు. ఎవర్రా బాబూ అనుకుంటూ వీధిలోకి వెళ్ళేసరికి తెనాల్లో మా మామగారింటిప్రక్కనుండే ప్లీడరుగుమాస్తా రామావధాన్లు కనుపించేడు.

"రండి. ఎప్పుడొచ్చేరు?" అని ఆహ్వానించేను.

"నిన్న వచ్చానండీ. ఆస్పత్రిపనిమీద వచ్చాను. ఇదిగో మీ మామగారిచ్చారు" అంటూ ఒకకవరు ఇచ్చాడు.

"కూర్చోండి. కాఫీ తెప్పిస్తాను."

"వద్దండీ. కొంచెం పనివుంది. జనతాకి వెళ్ళాలి కూడాను" అని చక్కాపోయాడా ఆవరరీపోస్టు మేను. కవరు చింపేను.

"చి॥ సౌ॥ జానక్కి, మీ అమ్మ ఆశీర్వదించి వ్రాయడమేమనగా. మేమంతా క్షేమము. మీ క్షేమం తెలియపర్చవలెను. బాబ్జీగాడికి నా ముద్దులు. అల్లుడికి ఈనెలాఖర్ను 15 రోజులు సెలవుదొరుకుతుందని వ్రాశావు. ఆ సెలవుదినాలు ఇక్కడ గడపవలెనని మా కోరిక. నిన్నుచూసి అప్పుడే ఆరునెలలయింది. కాబట్టి తప్పక రావలెను. నాయినమ్మ నిన్ను అడిగినట్లు వ్రాయమంది. జవాబు వ్రాయవలెను."

భేషు, ఇహనేం. ఈ వుత్తరం మాకు ఆహ్వాన పత్రికన్నమాట. నాకు సెలవు దొరుకుతుందని ఈమెగారెప్పుడు వ్రాసిందో. సెలవు గ్రాంటవడం వాస్తవమేననుకోండి. ఇంక ఈ వుత్తరం చూడగానే ఈవిడవొళ్ళు విడిపోతుందన్నమాట. ఇంతలోనే బాబ్జీగాడు నన్ను మర్చిపోయారర్రో అన్నట్లుగా గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు. నాకు విసుగెత్తి ఆమెని పిలుద్దామని వీధిలోకెళ్ళాను. ఇంతలోనే వాడిధర్మమా అని వాళ్ళ నౌకరు కనిపించాడు. "ఒరే బాబూ పుణ్యముంటుంది- మా జానకిని నేను రమ్మన్నానిచెబుదూ" అని వాడ్ని పంపి లోపలికొచ్చి కుర్రాణ్ణి చంకనేసుకుని ఆడిస్తూండగా ఆమెగారు రుసరుసలాడ్తూ వచ్చింది.

"ఛీ, ఏం మగవాళ్ళండీ! ఒక్కగంటకూడా సుఖంగా వుంటే చూళ్ళేరుగదా!" అని

చంటాడ్ని విసురుగా చంకనేసుకుని వాడి ఆకలి తృష్ణ బాపుతోంది.

"ఔరా, నాదగ్గరుండడంకన్నా స్నేహితుల దగ్గరుండడం నీకు సుఖమన్నమాట."

"అదికాదండీ, కమలకి రోజూ తీరికుండదు కదా! ఆదివారంనాడైనా కాస్త కులాసాగా కబుర్లు చెప్పుకుందామని వెళ్తే ఇలా పెడర్థాలు తీస్తారేం? అవసరేగాని, స్త్రీలనా, స్త్రీ స్వేచ్ఛన్నా మీకు కిట్టదు కదా! ఎప్పుడన్నా సిటీబస్సులో కమల తారసిల్లుతే మీరు లేచి మరీ సీటిస్తారుట. ఎందుకండీ?" అని క్రాస్ చేసింది.

చచ్చాంపో! దీనికేమి జవాబు చెప్పాలో నాకేం తట్టలేదు. ఈమె స్నేహితురాలి ముఖపద్మాన్ని కూర్చుని ఊర్ధ్వదృష్టితో చూచేకంటే, నిలబడి అధోకోణంలో చూడ్డం సులభతరమని ఎట్లా చెప్పను. ప్రసంగం తప్పిద్దామని-

"చూడూ, తెనాలినుండి మీ ఇంటిప్రక్కనుండే రామావధాన్లొచ్చాడు. మీ అమ్మ ఆయన ద్వారా ఉత్తరం పంపింది. ఇందు" అని ఇచ్చాడు. ఆంధ్ర రాజధాని విజయవాడలో పెట్టినంత సంతోషంగా మారిపోయిందావదనము. కనీసం నాలుగు సార్లయినా చదివిందా పెన్సిలు వ్రాత.

"ఏమండీ! వెళ్దామా? నాకు వెళ్ళాలని చాలా యిదిగావుంది సుమండీ! మా నాయినమ్మని చూడాలనుంది. ఇంకెన్నాళ్ళో బ్రతకదు కూడా."

"మీ నాయినమ్మ శిఖగోసిరి. మీవాళ్ళ మాటెత్తకు. నాకు మండుకొస్తుంది. ఇస్తానన్న ర్యాలీ సైకిలింతవరకు ఇవ్వలేదు. మీ నాయినమ్మకిప్పుడు 80 ఏళ్ళేగదా! "పాపిచిరాయువు" అలాంటివాళ్ళొకంతట చావర్లే. శతంవరకూ ఏమీ ఢోకా లేదు, విచారించకు."

"ఏం మాట్లండీ? అయినా మీకిప్పుడు సైకిలొకటి తక్కువొచ్చిందికాబోలు. ఈ మహారాణీపేట ఎగుడుదిగుడులో ప్రమాదం కాదండీ?"

"నీ ఆడబుద్ధి పోనిచ్చావుకాదు. నాకు ప్రమాదమని మీ నాన్న సైకిలివ్వలేదన్నమాట. 'పాగా చుట్టలేక తల వంకర'న్నాట్ట వెనకటికో ప్లీడరు. అట్లావుంది. మీ నాన్నంత శిఖండి ఎవడేనా వున్నాడూ? పట్టి పిసినారిగాడు. ఏం! ఈవుత్తరం పోస్టులో పంపకూడదూ? బేడ దండుగ మరి."

"పోన్లెండి. ఎన్నిమాట్లయినా అంటారు" అంటూ కర్నూలు గుడారాల్లోని ముఖాల్లాటి మొహం పెట్టింది. ఇంతలో బాబ్జీగాడు మళ్ళీ నెమ్మదిగా స్వరం ఎత్తుకున్నాడు. అసలే అమ్మగారు దూర్వాసుడ్ని మరిపిస్తోందేమో వాడి ఎర్రటి వీపుమీద ఒక్క మసాలా అట్టు వేసింది. దాంతోటివాడు ఈమధ్య వినపడనంతటి హెచ్చుస్థాయిలో, రోజూ రేడియోలో వచ్చే నిలయ విద్వాంసుల గాత్రాన్ని మరిపించేడు. తల్లికాదూ, మళ్ళీ వాడ్ని బుజ్జగించి నూనుకోపెట్టి ఆ ఘాన్ని పోగొట్టింది.

"చూడు, జానకీ అంతగా కావలంటే నిన్ను తెనాల్లో దిగవిడిచి మరీ వూరెళ్తాను. తిరిగి మీ తమ్ముడ్ని తీసుకుని తోడుగా రావచ్చు" అని నేను తీర్మానం ప్రతిపాదించి "సరే దానికేంగాని, ముందు కాఫీచేసి వంట ప్రయత్నంచెయ్యి మొదటాట సినిమాకి వెళ్దాం" అన్నాను.

"అంతకంటే" అంటూంటే ఆవిడ ముఖంలో తెలంగాణాసమేత విశాలాంధ్రసాధించిన విజయం కనీ కనిపించనట్లు గోచరించింది. ఆడవాళ్లు అల్పసంతోషులుగా ఇలాంటి విషయాల్లో!


## క్రిస్టమస్ బహుమతులకు-

నికరమైన

కాశ్మీర్‌దేశపు వస్తుసముదాయానికి—

శాలువలు సిల్కులు, తివాసీలు, "ఫర్"లు, నగిషీ కర్రసామానులు, కాగితపు అట్టలతో చేసిన అందమైన వస్తువులు, నమ్‌దాలు, రగ్గులు, ఉన్నిబట్టలు, వెండిసామాన్లు, తేనె, కుంకుమపువ్వు—

ఏవి కావలసినా

ఒకసారి మా సేల్స్ ఎమ్‌పోరియమ్‌కు దయచేయండి!

9, మౌంటురోడ్డు, మద్రాసు.

టెలిఫోన్: 85925

(కాశ్మీర్ ప్రభుత్వముచే నిర్వహింపబడుతున్నది)

ఏది సత్యం? ఏదసత్యం?

# పాకిస్తాన్ అమెరికాతో వియ్యం

మోపర్తి సత్యనారాయణమూర్తి

ఇటీవల యావత్ప్రపంచ దృష్టిని ఆకర్షించిన సమస్యలలో పాకిస్తాను అమెరికాతో తలపెట్టిన సైనిక ఒడంబడిక ప్రధానమైనది. గడచిన మూడు సంవత్సరాలుగా యిందుకోసం జరుగుతున్న మంతనాలు ఫలించి, యీ రోజుకు అది వాస్తవ విషయమయినట్లు కనిపిస్తున్నది. సైనికంగా అభివృద్ధి చెందవలసిన అవసరమేమి కలిగిందో, అది పాకిస్తానుకు సంబంధించిన విషయం కాబట్టి దానికే తెలియాలి. కేవలం సైనిక పటిష్ఠత మాత్రమే యిందువల్ల పాకిస్తాను అభిలాష అయినప్పటికీ, ఆ అభిలాషయొక్క స్వభావాన్ని శంకించడం మానవసహజమనే చెప్పవలసివుంది. ఏది యెలావున్నా ఇండియా, పాకిస్తాను దేశాలు తమ సమస్యలన్నింటినీ పరస్పరం స్నేహపూరిత వాతావరణంలో పరిష్కరించుకునేందుకు ఓవైపు పట్టువల కనిపిస్తూంటే, మరోవైపు పాకిస్తాను తలబెట్టిన యీ సైనిక ఒడంబడిక విడ్డూరంగా కనిపిస్తున్నదంటే అందులో ఆవగింజంతయినా అతిశయోక్తిలేదు.

గడచిన డిసెంబరు తొమ్మిదవ తేదీన పాకిస్తాను ప్రధాని మహమ్మదాలీ ఒక అమెరికను విలేకరితో చేసిన ప్రసంగంలో యీ సైనిక ఒడంబడిక లక్ష్యమేమిటో విచారించాడు. ఆయన వెల్లడించిన విషయాలు ముఖ్యంగా (1) పాకిస్తానుకి భారతదేశంమీద దాడిచేసే వుద్దేశం యేకోశానా లేదనీ, పైగా యీ ఒడంబడికవల్ల పాకిస్తాను సైనికంగా పటిష్ఠమయితే అందువల్ల ఇండియాకు ఇతోధికరక్షణ చేకూరుతుందనీ (2) బలమైన పాకిస్తాను టర్కీతో కలిసి పర్షియా రక్షణ యివ్వగలదనీ. ఈ రెండు వాదాల్లో ఎంత సత్యమున్నదీ సుస్పష్టం. పాకిస్తాను భారతదేశంమీద సరాసరి దాడి చేస్తుందని ఎవరికీ అనుమానం లేకపోయినా, కాశ్మీరు వివాద పరిష్కారానికి, అమెరికా సైనిక సహాయంతో పెద్ద ఎత్తున తిరిగి దౌర్జన్యానికి పూనుకోదని హామీ ఏమున్నది? ఇక పర్షియా రక్షణ విషయమై పాకిస్తాను ప్రధాని వాదనకు అంతర్జాతీయంగా ఎంత విలువున్నదో అందరికీ తెలుసు. ఎవరికీతోచని బెడద పర్షియాకు వున్నట్లు ఒక్క మహమ్మదాలికే యెలా తెలిసిందో? పోతే పర్షియా, టర్కీ యింకా యితర మధ్య ప్రాచ్యదేశాల సహకారం, సద్భావం చూరగొనేందుకు మహమ్మదాలీ అలా చెప్పి వుండవచ్చు.

పోనీ మహమ్మదాలీ అభివర్ణించినట్లు యీ సంధి అంత హానిరహితమైతే ఒడంబడికయొక్క మహోద్దేశాల్ని వెల్లడించడానికి యింత కాలవిలంబన ఎందుకు? సంధి సంప్రతింపులు అబద్ధమంటూ అంతగా సంధి లక్ష్యాల్ని ఎందుకు కాపాడవలసివచ్చింది?

తాజావార్తల్ని బట్టి రష్యా, చైనా, ఇండియా యీ మూడు దేశాల నిరసనను నిరాకరించి, ముందు ఏర్పాట్లను గురించి పాకిస్తాను మంత్రివర్గం ఆలోచిస్తున్నట్లు కనిపుస్తున్నది. ఆర్థికాభివృద్ధిగాక పాకిస్తాను కోరేది సైనికపాటవం కావడం యిందులో గమనించదగ్గ విషయం. అమెరికాకు తాము ప్రత్యామ్నాయంగా చేయబోయే సహాయమేమిటో మహమ్మదాలీ చెప్పలేదు. కేవలం తమ సైన్యాన్ని కట్టుదిట్టం చేసుకోవడం మినహాగా, యీ ఒడంబడిన ఆవశ్యకత ఏమిటో వివరించలేక పోయాడు.

ఇక అటు అమెరికావైపు కొంతమంది నాయకులు ఒడంబడిక కేవలం నిరాధారమని ఖండించడమో, మరికొందరు పాకిస్థాను రక్షణకోసం మాత్రమే యిది ఉద్దేశించబడ్డదని, పాకిస్థాను పట్ల సానుభూతితో అన్నట్లు చెప్పడమో జరుగుతున్నది. ఇండియాలో అమెరికను రాయబారి, జార్జి ఎలెడ్ యీ విషయాన్ని గురించు ప్రసం